గోతుల్లోనే ప్రయాణం!


లంకలకలువగుంటకు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి


నడుపూరు నుంచి ఆర్వీపల్లికి వెళ్లే దారి

- ఇదిగో.. అదిగో కొత్త రోడ్లు అంటూ కాలయాపన
- పెడన మండలంలోని గ్రామాలకు వెళ్లాలంటే హడలిపోతున్న గ్రామస్తులు

పెడన: మండల పరిధిలోని పలు రోడ్లు అధ్వానంగా కనిపిస్తున్నాయి. అంతకు ముందున్న రహదారులను పూర్తిగా తవ్వేసి కొత్త రోడ్లు వేసేస్తున్నట్లు హడావుడి చేసి వదిలేయడంతో అవి కాస్తా మరింత దారుణంగా మారాయి. కొండ నాలుకకు మందు వస్తే ఉన్న నాలుక కూడా ఊడిందనే చందాన పరిస్థితి మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. మరో పక్క నిధులు లేక పనులు ఆగాయని కూటమి నేతలు పేర్కొంటూనే ఉన్నారు. నందమూరు నుంచి అచ్చయ్యవారిపాలెం, జింజేరు, నేలకొండపల్లి నుంచి లంకలకలువగుంట, ఉరివి గ్రామాలకు వెళ్లే రహదారితో పాటు నడుపూరు నుంచి ఆర్వీపల్లి రోడ్డు, కొంగంచర్ల, గురువిందగుంట, కవిపురం తదితర రోడ్లు అధ్వానంగా మారాయి. గతుకులమయంగా ఉండటంతో నిత్యం ప్రయాణం నరకంగా ఉంటోందని వాపోతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో రూ.4.60 కోట్లు మంజూరు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని రోడ్ల నిర్మాణానికి రూ.4.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నందమూరు నుంచి జింజేరుకు రోడ్డు వేయడానికి రూ.2కోట్లు, నడుపూరు నుంచి గూడూరు మండలం ఆర్వీపల్లి వరకు రూ.1.20కోట్లు, కొంగంచర్ల రోడ్డుకు రూ.70లక్షలు, గురువిందగుంట, కవిపురం రోడ్డుకు రూ.70లక్షలు మంజూరయ్యాయి.

కోడ్ రావడంతో నిలిచిన పనులు

గురువిందగుంట, కవిపురం, కొంగంచర్ల, జింజేరు రోడ్ల పనులు ప్రారంభించారు. ఈ పనులు జరుగుతున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో అవి నిలిచిపోయాయి. అనంతరం ప్రభుత్వమే మారిపోయింది. అప్పటి నుంచి కూడా ఈ రోడ్ల నిర్మాణం ముందుకు సాగలేదు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



ఈరోడ్లపై ప్రయాణంగా నిత్యంగా నరకంగా ఉంది. గ్రామస్తులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదొక్కటే కాదు. నడుపూరు నుంచి ఆర్వీపల్లికి వెళ్లేవారు, నందమూరు నుంచి అచ్చయ్యవారిపాలెం, జింజేరు గ్రామాలకు వెళ్లే గ్రామస్తుల, కొంగంచర్ల ప్రజలు సైతం రాకపోకల సమయంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి రోడ్లు నిర్మించాలి.

–రాజులపాటి అచ్యుతరావు, మాజీ ఎంపీపీ, గురువిందగుంట గ్రామం, పెడన

త్వరలోనే పనులు తిరిగి ప్రారంభించేలా చూస్తాం



ఆయా రోడ్లకు సంబంధించి రివైజ్డ్ అంచనాలు రూపొందించి పంపించాం. పెరిగిన ధరల ప్రకారం నిధులు మంజూరయ్యాయి. గతంలో రూ.4.60కోట్లు ఉన్న వాటికి రూ.5.42కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.2.50కోట్లు వరకు నిధులు రావడంతో ఆయా రోడ్ల నిర్మాణం జరిగి అసంపూర్తిగా నిలిచిపోయాయి. వాటిని తిరిగి ప్రారంభించి త్వరితగతిన రోడ్లు వేస్తాం.

– ధర్మయ్య, పంచాయతీరాజ్ ఏఈ, పెడన మండలం

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి

మచిలీపట్నంఅర్బన్: డెంగీ వ్యాధి నివారణకు వారంలో ఒక్కరోజు శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ఠ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఆమె మాట్లాడుతూ డెంగీ జ్వరాన్ని వైరస్ సంక్రమణ కలిగించే ఎడిస్ ఈజిప్టై దోమలు వ్యాప్తి చేస్తాయని, ఇవి ఎక్కువగా ఇంటి లోపల లేదా పరిసర ప్రాంతాల్లో పగటి సమయంలో కుడతాయన్నారు. అకస్మాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, కంటి నొప్పి, ఎర్రటి దద్దుర్లు, రక్తస్రావం, అధిక దాహం, నోరు ఎండిపోవడం లాంటి లక్షణాలు డెంగీకి సంకేతాలుగా గుర్తించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి బి. రామారావు మాట్లాడుతూ డెంగీ హెమొరాజిక్ ఫీవర్, డెంగీ షాక్ సిండ్రోమ్ వంటి తీవ్ర లక్షణాలు ప్రమాదకరమన్నారు. ఇళ్లలో, పరిసరాల్లో చిన్న మొత్తంలోనైనా నీరు నిల్వ ఉండకూడదని, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, టీకప్పులు, నీటి ట్యాంకులు, పంపులు, కూలర్లు తదితర వాటిని శుభ్రంగా ఉంచాలన్నారు. డెంగీ లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సిబ్బంది, పట్టణ పరిధిలోని ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


డెంగీ అవగాహన ర్యాలీలో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శర్మిష్ఠ

రైతులు వివరాలు సరి చూసుకోవాలి

చల్లపల్లి: అన్నదాత సుఖీభవ పథకం కింద, ఆధార్ లింక్ అయిన పట్టాదారు రైతుల వివరాలు పరిశీలన జరుగుతుందని రైతులు తమ వివరాలు సక్రమంగా ఉన్నాయో... లేవో... సరిచూసుకోవాలని మండల వ్యవసాయాధికారి సాయిసింధు సూచించారు. ఆయా రెవెన్యూ గ్రామ ప్రాంత పరిధిలో రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సహాయ వ్యవసాయ సంచాలకుల వద్ద ఉన్న జాబితాల్లో వారి పేర్లను పరిశీలించుకోవాలని కోరారు. ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు తెలియజేయాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ నగర కమిటీ నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మచిలీపట్నం నగర పార్టీ కమిటీకి వివిధ హోదాల్లో కమిటీ సభ్యులను నియమిస్తూ శుక్రవారం తాడేపల్లి ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నగరపార్టీ కమిటీ అధ్యక్షుడిగా మేకల వెంకటసుధాకర్ బాబు (సుబ్బన్న), ఉపాధ్యక్షులుగా కాగిత జవహర్‌లాల్‌నెహ్రూ (బున్నీ), గూడవల్లి నాగరాజు, కొలుసు హరినందబాబు, షేక్ షాహీనాలను నియమించారు.

పోయే దారి లేదు.. ఇలా రహదారిపైనే


చల్లపల్లి బస్టాండు ఎదురుగా, ఆంజనేయ స్వామి గుడి వద్ద మలుపులో నిలిచిన వర్షం నీరు


చల్లపల్లి-విజయవాడ ప్రధాన రహదారిలో ఎన్టీఆర్ పార్కు వద్ద ..

- చల్లపల్లిలో డ్రెయినేజీ సమస్య
- చినుకుపడితే రోడ్లు తటాకాలే..

చల్లపల్లి: డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో చల్లపల్లిలో చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారులన్నీ జలమయమవుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున చల్లపల్లిలో 0.78 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈ ప్రాంతంలో పూర్తి స్థాయిలో డ్రెయినేజీలు లేకపోవడంతో ఎక్కడికక్కడే రోడ్లపైనే వర్షం నీరు నిలిచిపోయింది. అయితే ఇక్కడ నీళ్లు నిలిస్తే బురదకయ్యగా మారి కంపు కొడుతూ ఉంటుంది. ఇటుగా వాహనాలు వెళ్తే బురదనీళ్లు చింది పాదచారులు, ఇతర వాహనచోదకులపై పడుతుంటాయి. రోడ్డు లెవల్ కంటే ఇరువైపులా ఉండే బరంత్ లెవల్ ఎత్తులో ఉండటంతో వాన నీరంతా రోడ్లపైనే నిలుస్తోంది. వర్షం పడినప్పుడల్లా ఇదే పరిస్థితి ఉంటున్నా అవసరమైన డ్రెయినేజీలు పూర్తిస్థాయిలో నిర్మించడంలో చల్లపల్లి పంచాయతీ విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి. పాలకులు చల్లపల్లికి శాశ్వత ప్రాతిపదికన డ్రెయినేజీ ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పొట్టి శ్రీరాములు వీధిలోని ఇస్లాంనగర్ వద్ద..


చల్లపల్లి-విజయవాడ రోడ్డులో నిమ్మలతోటకు వెళ్లే దారిలో..

ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు దీటైన జవాబు

బందరులో తిరంగా ర్యాలీ



చిలకలపూడి(మచిలీపట్నం): పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్‌తో భారతదేశ సైనికులు పోరాటం చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో పాటు ఆ దేశానికి దీటైన జవాబు ఇచ్చారని కూటమి నాయకులు అన్నారు. కూటమి ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ విజయం సాధించడంతో జాతీయజెండాలు ధరించి శుక్రవారం కోనేరుసెంటర్ నుంచి బస్టాండ్ సెంటరు వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో వీరమరణం పొందిన భారత సైనికులకు నేతలు నివాళులర్పించారు. భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నేతలు బండి రామకృష్ణ, కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య), ఎంవీ బాబాప్రసాద్, పంతం గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల నగర కమిటీ నియామకం



చిలకలపూడి(మచిలీపట్నం): నాలుగో తరగతి ఉద్యోగుల మచిలీపట్నం నగర కమిటీ సభ్యులను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కోర్టు సెంటరులోని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో కార్యవర్గ సభ్యుల ఎన్నికను ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షుడు కేఎస్ఎస్ఎన్‌వీ ఆర్‌వీ ప్రసాద్, సహాయ ఎన్నికల అధికారిగా రాము, పర్యవేక్షకుడిగా ఎస్వీ కృష్ణారావు నిర్వహించారు. ఎన్నికల్లో నగర అధ్యక్షుడిగా లోయ అంజనేయులు, కార్యదర్శిగా కె.రాజు, కోశాధికారిగా కె.నీలకంఠన్, ఉపాధ్యక్షులుగా వి.నాంచారయ్య, బి.రమాదేవి, సంయుక్త కార్యదర్శులుగా కె.వెంకటేశ్వరరావు, బీఎస్ఎస్ తేజ లను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జి రమేష్, కమిటీ సభ్యులుగా డీవీఎస్ఎన్ మల్లేశ్వరరావు, ఎం.నిరీక్షణరావు, ఎస్.తిరుమలనాగరాజును ఎన్నుకున్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరు రోజులు వైభవంగా నిర్వహించే ఉత్సవాలకు దేవదాయ శాఖ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. 22 వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు తెలిపారు. రోజూ ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు, ఆధ్యాత్మిక వేదికపై భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. తొలిరోజు ఉదయం సుప్రభాతసేవ, 1008 గులాబీ పూలతో ప్రత్యేక పూజ, 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం, కోలాటం ప్రదర్శన, సాయంత్రం వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ, కూచిపూడి నృత్యప్రదర్శన, మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు. 18 ఉదయం సుప్రభాతసేవ, 1008 మల్లి పూలతో ప్రత్యేక పూజ, సంప్రదాయ సంకీర్తనలు, కోలాటం ప్రదర్శన, సాయంత్రం వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ, మిమిక్రీ, రింగ్ డ్యాన్స్ ప్రదర్శన, సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన నిర్వహించనున్నారు. 19వ తేదిన ఉదయం సుప్రభాతసేవ, 1008 చామంతి పూలతో ప్రత్యేక పూజ, 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం, కోలాటం ప్రదర్శన, సాయంత్రం వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ, డాన్స్ బేబి డాన్స్, మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు. 20వ తేదిన ఉదయం సుప్రభాతసేవ, 1008 లిల్లీ పూలతో ప్రత్యేక పూజ, భజనలు, కోలాటం ప్రదర్శన, సాయంత్రం వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజ చేయనున్నారు.

కక్షిదారులకు దూరాభారం తగ్గుతుంది

- జిల్లా సెషన్స్ జడ్జి గోపి
- అవనిగడ్డలో 6వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ప్రారంభం


ఆరవ అదనపు జిల్లా జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న జిల్లా సెషన్స్ జడ్జి గోపి

అవనిగడ్డ: అవనిగడ్డలో కొత్తగా ఏర్పాటు చేసిన 6వ అదనపు జిల్లా జడ్జి కోర్టుతో దివిసీమలోని తీర ప్రాంత కక్షిదారులకు దూరాభారం తగ్గుతుందని జిల్లా సెషన్స్ జడ్జి గోపి పేర్కొన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన 6వ అదనపు జిల్లా జడ్జి కోర్టును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు సౌలభ్యం కోసం కోర్టుల వికేంద్రీకరణ జరగాలని సుప్రీంకోర్టు వెల్లడించిన నేపథ్యంలో అవనిగడ్డలో జిల్లా కోర్టు ఏర్పాటు చేశారన్నారు. కక్షిదారులు కేసులు, వాయిదాల కోసం వందల కిలో మీటర్లు వెళ్లడానికి పడే ఇబ్బందులు పరిష్కరించేందుకు అవనిగడ్డలో కోర్టుని ఏర్పాటు చేశారన్నారు. తీర ప్రాంత ప్రజలు ఈ కోర్టుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవనిగడ్డకు జిల్లా కోర్టు రావడానికి జిల్లా న్యాయమూర్తులతో పాటు హైకోర్టు, జిల్లా కోర్టు సిబ్బంది, అవనిగడ్డ బార్ అసోసియేషన్ సభ్యుల సమష్టి కృషి ఉందన్నారు. ఆరవ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు నూతనంగా నియమించిన పి.పాండురంగారెడ్డి జిల్లా సెషన్స్ జడ్జి గోపి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలు కేసులను ఆయన సమీక్షించారు. అనంతరం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా జడ్జిలు గోపీ, పాండురంగారెడ్డిని ఘనంగా సత్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.అరుణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత వోల్గా, ఏజీపీ నరహరశెట్టి ఈశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాయపూడి వేణుగోపాలరావు, కోశాధికారి రఘు, సీనియర్ న్యాయవాదులు మాదివాడ వెంకటకృష్ణారావు, అందె శ్రీరామమూర్తి, మత్తి వెంకటేశ్వరరావు, పర్చూరి రాఘవేంద్రరావు, గొల్తి గౌరీశంకర్, బడే వెంకట శేషగిరిరావు, ఇమ్మిడిశెట్టి లక్ష్మీనారాయణ, చిట్టిప్రోలు ప్రసాద్, వికృతి రాంబాబు, నాగమల్లేశ్వరరావు, మోగార్జునరావు, వీరబాబు, లోక్‌అదాలత్ సభ్యుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్టీలకు ఆధార్ కార్డులు అందజేయండి

పెడన: మండలంలో ఎస్టీలు నివసించే ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో అరుణకుమారి ఆదేశించారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని కూడూరు, నందిగామ, మడక గ్రామాల్లో పర్యటించి ఎస్టీలకు ఆధార్ కార్డులను అందజేశారు. ఆధార్ కార్డులు లేని వారి కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్క ఎస్టీకి ఆధార్‌కార్డు తప్పనిసరిగా అందజేయాల్సి ఉంటుందన్నారు. ఎస్టీ కుటుంబాలకు రేషన్‌కార్డులు కూడా ఇవ్వాలని చెప్పారని, అలా చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. వారికి ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు ఇవ్వడానికి ఈ నెల 23వ తేదీలోపు వారిని కలిసి ఆరా తీసి వాటిని అందజేస్తామని తెలిపారు.


నందిగామలో ఎస్టీ కుటుంబానికి ఆధార్ కార్డు అందజేసిన ఎంపీడీవో అరుణకుమారి తదితరులు

పోషకాహారంతో ఆరోగ్యం

పెడన: పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్తలు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డు సచివాలయాల వద్ద అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని యుక్త వయస్సు బాలికలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా సమ్మర్ క్యాంపు నిర్వహించి అవగాహన కల్పించినట్లు మహిళా సంరక్షణ కార్యదర్శులు స్పష్టం చేశారు. అపరిచితులను నమ్మ వద్దని, ఇంట్లోని పెద్ద వారి మాటలను విని సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. చదువుపై ఆసక్తి చూపాలని, సెల్‌ఫోన్ల జోలికి పోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ ఆయాలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కోడూరు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాసంపై వేసవి తరగతులను నిర్వహించారు. నాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాజెక్టు సూపర్‌వైజర్ పి.ఆర్.రాజేశ్వరీ అధ్యక్షతన బాలికలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. కిశోర బాలల హక్కులు, బాల్య వివాహాలు, సోషల్ మీడియా పట్ల వ్యవహరించాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రతినిధి నాగభవాని, ఏఎన్ఎం సునీత, అంగన్‌వాడీ వర్కర్ ఎస్.ఆశలత, సిబ్బంది పాల్గొన్నారు.


కోడూరులో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ

నేడు పెడనలో తిరంగా రన్

పెడన: నియోజకవర్గ పరిధిలో శనివారం పట్టణంలో తిరంగా రన్ ర్యాలీని ఏర్పాటు చేసినట్లు పెడన ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. కార్యక్రమంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని ఆసక్తి ఉన్న వారు పాల్గొనాల్సిందిగా కోరారు.

రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

పామర్రు: రోడ్డు భద్రత నియమాలను వాహనచోదకులు పాటించాలని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పామర్రు- దిగమర్రు జాతీయ రహదారిలో వాహనాల తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. 70 వాహనాలు తనిఖీలు చేశారు.

క్లుప్తంగా

మొక్కజొన్న రైతు ఆందోళన



కె. కొత్తపాలెం(మోపిదేవి): ఆకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో మొక్కజొన్న పంట వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కె. కొత్తపాలెంలో సాగు చేపట్టిన మొక్కజొన్న కొద్దిపాటి వర్షానికి తడిసిపోయింది. పొలం నుంచి దిగుబడి చేసిన మొక్కజొన్నను ఆరపెట్టుకోవడానికి రైతులు కల్లాల్లో పోశారు. గురువారం రాత్రి పడిన వర్షానికి మొక్కజొన్న తడిసి ముద్దవ్వగా, విరిసిన మొక్కజొన్న పొత్తులు కూడా తడిసి పోయాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తడిసిన మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఘంటసాల: ఘంటసాల సెక్షన్‌లోని 33/11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉయ్యూరు ఈఈ డి.కృష్ణ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఘంటసాల, కొడాలి, శ్రీకాకుళం గ్రామాల్లోని 33/11కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్లలో నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.గోవిందరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఈడేపల్లి పోస్టల్‌కాలనీ, సింగరాజు వారివీధి, జిల్లాకోర్టు వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాఉండదని పేర్కొన్నారు.

లోక కల్యాణార్థం చండీహోమం



పెడన: లోక కల్యాణార్థం దేశం సస్యశ్యామలానికి దేవాంగ అర్చక పురోహిత సిద్ధాంత బృందం శుక్రవారం చండీ హోమం నిర్వహించింది. పట్టణంలోని 23వ వార్డు బ్రహ్మపురం శ్రీరామలింగ చౌడేశ్వరి భజన గుడి వద్ద బృందం శుక్రవారం హోమం చేసింది. దేశ సరిహద్దుల్లో ఏర్పడిన యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశ సంరక్షణార్థం హోమం నిర్వహిస్తున్నట్లు ఆ బృంద అధ్యక్షుడు వుట్ల తిరుమలరావు తెలిపారు. కార్యక్రమంలో పెడన, కప్పలదొడ్డి, మల్లవోలు, పోలవరం, చింతగుండపాలెం, చల్లపల్లి ప్రాంతాల దేవాంగ అర్చక పురోహిత సిద్ధాంతులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

తాడేపల్లి(ఘంటసాల): ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో అర్చకులు రొంపిచర్ల వెంకట శేష సుధాకర్, అర్చక యజ్ఞికులు నల్లూరి దాశరథి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామి వారి కల్యాణంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంకటహర చతుర్ధిని పురస్కరించుకుని జరిగిన పూజా కార్యక్రమంలో 114 మంది ఉభయదాతలు పూజలు నిర్వహించారు. సమాజ శ్రేయస్సు, లోక కల్యాణం కోసం పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు.

వ్యవసాయ సహాయకులు సక్రమంగా పని చేయాలి

గన్నవరం రూరల్: గ్రామ స్థాయిలో వ్యవసాయ సహాయకులు డేటా వెరిఫికేషన్ సమర్థంగా పూర్తి చేయాలని గన్నవరం అగ్రికల్చర్ ఏడీఏ ఎం.సునీల్ ఆదేశించారు. ముస్తాబాద రైతు సేవా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సహాయకులు, రైతులతో ఆయన ఏవో వై.రజనితో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయం తక్కువగా ఉందని, త్వరగా వెరిఫికేషన్ పూర్తి చేయాలని చెప్పారు. ఏడాదికి మూడు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్‌తో కలసి రూ.20వేలు అందిస్తుందన్నారు. సొంత భూమి ఉన్న రైతులకు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

సంగీత శిక్షణ తరగతులు

పెనమలూరు: కానూరు కార్మెల్ మాత దేవాలయంలో ఫాదర్ శౌరి ఆధ్వర్యంలో సంగీతం శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కీ బోర్డు, రిథం ప్యాడ్, తబల అనుభవజ్ఞుడైన మాస్టర్ ఎల్.పుష్పనాథ్‌తో శిక్షణ ఇస్తామని ఫాదర్ శౌరి తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు టీవీలు, సెల్ ఫోన్‌లకు అలవాటుపడకుండా ఉండటానికి సంగీత కళను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. వివిధ గ్రామాల నుంచి పిల్లలు వచ్చి సంగీత శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వచ్చి ఉచిత సంగీత శిక్షణ పొందాలని సూచించారు.